తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

సోమవారం
2 నవంబర్ 2026

పేజీలు : 08

Follow :

ఘనంగా కాష్ సంఘం
65 వసంతాల వైభవోత్సవం

బోడుప్పల్‌లో దసరా ప్రీతి మిలన్ - అలయ్ బలయ్ వేడుకలు

బోడుప్పల్-జనంసాక్షి : నకాష్ బంధువుల ఐకమత్యం, సంప్రదాయాల పరిరక్షణ, ఆత్మీయతను చాటిచెప్పేలా రాష్ట్ర నకాష్ సంఘం ఆధ్వర్యంలో దసరా ప్రీతి మిలన్ - అలయ్ బలయ్ వేడుకలతో పాటు సంఘం 65 వసంతాల వైభవోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బోడుప్పల్‌లోని శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయ ప్రాంగణంలోని శ్రీ మాతా నిమిషాంబ భవన్‌లో జరిగిన ఈ వేడుకల్లో నకాష్ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వారసత్వ కళను భావితరాలకు అందించాలి

1961లో స్థాపించిన నకాష్ సంఘం ఆరు దశాబ్దాలకు పైగా సాగించిన ప్రస్థానాన్ని స్మరించుకుంటూ 65వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేసిన పెద్దలు, నాయకులు, సభ్యుల సేవలు అభినందనీయమన్నారు. నకాష్ కులవృత్తి, కళా నైపుణ్యం, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సంఘ ఐకమత్యాన్ని మరింత బలోపేతం చేస్తూ సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఆటపాటలతో సందడి.. సహపంక్తి భోజనాలు



వేడుకల్లో భాగంగా బాలబాలికలకు, మహిళలకు వివిధ ఆటల పోటీలు, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. నకాష్ బంధువులందరికీ సంప్రదాయ సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి హాజరైన బంధువులు పరస్పరం ప్రేమాభిమానాలు పంచుకుంటూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఇలాంటి సమ్మేళనాలు సమాజంలో ఐకమత్యం, పరస్పర సహకారం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ముఖ్య అతిథులుగా ప్రముఖులు

ఈ కార్యక్రమానికి బీసీ డెడికేషన్ కమిషన్ ప్రత్యేక చైర్మన్ భూసాని వెంకటేశ్వరరావు, ఐఏఎస్ (రిటైర్డ్), పద్మశ్రీ అవార్డు గ్రహీత, డీఆర్‌డీఎల్ మాజీ డైరెక్టర్ నాంపల్లి దివాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.రాష్ట్ర నకాష్ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కె. అశోక్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సహాయ కోశాధికారి ధనలకోట సతీష్, ఉపాధ్యక్షుడు ధనలకోట నర్సింగ్ రావు, కార్యదర్శులు రామగిరి శ్రీకాంత్, ముత్యాల శ్రీనివాస్, నాంపల్లి శ్రీకాంత్, హిమచందర్, ఎన్. రమేష్, నానాగిరి రామకృష్ణ, ఎం. శ్యామ్, డి. రామకృష్ణ, డి. నరేష్, కె. ప్రవీణ్ కుమార్, మోహన్, సత్యనారాయణతో పాటు వివిధ జిల్లాల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, ఆలయ కమిటీ సభ్యులు, నకాష్ బంధువులు పాల్గొన్నారు.



పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వం

లక్ష్మాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

లోపలి పేజీలో

ఓపెన్ యూనివర్సిటీ విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి డా. పి. సురేష్ బాబు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్‌లో ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం

రిజర్వేషన్లు అనుభవిస్తూ కూడా అంబేద్కర్‌ను విస్మరిస్తున్నారు

- విజయవంతంగా 402వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల
- అంబేద్కర్ను విమర్శిస్తే పుట్టగతులు ఉండవు జాగ్రత్త
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నత్తి మైసయ్య



అనుమానాస్పద స్థితిలో గొర్రెల కాపరి మృతి

- కాలువలో టీవీఎస్ ఎక్సెల్‌తో సహా మృతదేహం గుర్తింపు
- ముఖంపై గాయాలున్నాయని కుటుంబ సభ్యుల అనుమానం
- పోలీసులకు ఫిర్యాదు.. పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు





నవాబుపేట, నవంబర్ 1 (జనంసాక్షి): అర్మతల గ్రామానికి చెందిన గొర్రెల కాపరి శీలపురం కిష్టయ్య (57) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందాడు. శనివారం సాయంత్రం మీనపల్లి కలాన్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని కాలువలో పడి మృతి చెందినట్లు ఆదివారం ఉదయం స్థానికులు గుర్తించారు. ఘటనపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కిష్టయ్య శనివారం సాయంత్రం తన అన్నదమ్ములను కలిసేందుకు మీనపల్లి కలాన్ గ్రామానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తానని భార్య అనంతమ్మకు చెప్పి వెళ్లిన ఆయన రాత్రి అయినా చేరుకోలేదు. భారీ వర్షం కురుస్తుండటంతో అక్కడే ఉండిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. ఆదివారం ఉదయం మీనపల్లి కలాన్ నుంచి నవాబుపేటకు వస్తున్న కొందరు రోడ్డు పక్కన కాలువలో టీవీఎస్ ఎక్సెల్ వాహనంతో పాటు కిష్టయ్య మృతదేహాన్ని గుర్తించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. కిష్టయ్య ముఖంపై గాయాలు కనిపిస్తున్నాయని, వాహనానికి ప్రమాదం జరిగినట్లు స్పష్టమైన ఆనవాళ్లు లేవని భార్య అనంతమ్మ, కుమారుడు బీరప్ప అనుమానం వ్యక్తం చేశారు. ఎవరో దాడి చేసి కాలువలో పడేసి ఉంటారని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కిష్టయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు యాదయ్య ఆర్మీలో పనిచేస్తుండగా, మరో కుమారుడు బీరప్ప అర్మతలలో నివసిస్తున్నాడు. కిష్టయ్య గత రెండు దశాబ్దాలుగా అర్మతలలో గొర్రెల కాపరిగా జీవిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఫిర్యాదు మేరకు నవాబుపేట ఎస్సై గిరి ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కిష్టయ్య మృతిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



మురుగునీటి పునర్వినియోగానికి
గ్రీన్ ట్యాంకర్ సేవలు

- ముల్లకత్వ ఎస్టీపీ వద్ద ప్రారంభించిన సైబరాబాద్ కమిషనర్
- తోటలు, పార్కుల నిర్వహణకు శుద్ధి చేసిన నీరు
- గ్రీన్ ట్యాంకర్ల బుకింగ్‌కు 155313 హెల్ప్‌లైన్
- తాగునీటి వనరుల పరిరక్షణే లక్ష్యం

శేరిలింగంపల్లి, నవంబర్ 1 (జనం సాక్షి): సైబరాబాద్ పరిధిలో శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి వినియోగించడాన్ని ప్రోత్సహించేందుకు ముల్లకత్వ మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ) వద్ద గ్రీన్ ట్యాంకర్ సేవలను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన ఆదివారం ప్రారంభించారు. జలమండలి, అర్బన్ బయోడైవర్సిటీ విభాగాల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

పార్కులు, తోటలు, ల్యాండ్‌స్కేపింగ్ వంటి తాగునీరు అవసరం లేని పనులకు శుద్ధి చేసిన ఎస్టీపీ నీటిని వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. ప్రజలు, సంస్థలు తమ అవసరాలకు అనుగుణంగా గ్రీన్ ట్యాంకర్లను బుక్ చేసుకునేందుకు 155313 హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చని వెల్లడించారు.విలువైన తాగునీరు, భూగర్భ జలాలను కాపాడేందుకు శుద్ధి చేసిన నీటి పునర్వినియోగం అవసరమని కమిషనర్ పేర్కొన్నారు. నివాస సంక్షేమ సంఘాలు, విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు ఈ సేవలను వినియోగించుకుని నీటి పొదుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మండల సంతోష్, ఎస్టీపీ జనరల్ మేనేజర్ తిప్పన్న, జనరల్ మేనేజర్ హరీష్ శంకర్‌తో పాటు సిఎంసి, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీ విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: డా. పి. సురేష్ బాబు



హయత్‌నగర్, నవంబర్ 1 (జనం సాక్షి) :ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లెర్నర్ సర్వీసెస్ సెంటర్-171 ఆధ్వర్యంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆదివారం ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విద్యా విధానం, పరీక్షల నిర్వహణ, అధ్యయన సామగ్రి, ఆన్‌లైన్ అభ్యసన వనరులు, స్వీయ అభ్యసనం ప్రాముఖ్యత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సురేష్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు సమయపాలన, క్రమశిక్షణ అలవర్చుకొని విద్యా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. విశ్వవిద్యాలయం, లెర్నర్ సర్వీసెస్ సెంటర్ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమ సమన్వయకర్త డా. డి. మక్లా మాట్లాడుతూ, విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్యా సహాయ సేవలను వివరించారు. అంకితభావం, ఆత్మవిశ్వాసంతో ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ప్రవేశాలు, విద్యా కార్యకలాపాలు, పరీక్షలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. లైబ్రరీ సైన్స్ విభాగం అధ్యాపకులు, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ సమన్వయకర్త డా. ఎ. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందించే అధ్యయన సామగ్రి విద్యార్థుల జ్ఞానాభివృద్ధికి, పోటీ పరీక్షల సన్నద్ధతకు, భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల కౌన్సెలర్ల వివరాలను తెలియజేసి, ప్రతి సబ్జెక్టు ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు విశ్వవిద్యాలయం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని విద్యా, వృత్తిపరమైన రంగాల్లో రాణించాలని సూచించారు.

వెల్చాల్ గ్రామంలో అగ్నిప్రమాదానికి గురైన చర్చిని పరిశీలించి ఆర్థిక సహాయం అందించిన మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ చంద్రప్రియ.



మోమిన్‌పేట నవంబర్ 01 (జనం సాక్షి) :
దేవుడి దయతో గ్రామంలో నూతన మందిర నిర్మాణం త్వరలోనే చేపట్టాలని ఆకాంక్షిస్తూ మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ. చంద్రప్రియ ఆర్థిక సహాయం అందించారు. మోమిన్ పేట మండల పరిధిలోని వెల్చాల్ గ్రామంలో గత 15 రోజుల క్రితం చర్చిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో చర్చి దెబ్బతినడంతో విషయం తెలుసుకున్న చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ. చంద్రప్రియ ఆదివారం గ్రామాన్ని సందర్శించి ప్రమాదానికి గురైన చర్చిని పరిశీలించారు.అనంతరం నూతన మందిర నిర్మాణం కోసం తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.దేవుడి దయతో గ్రామంలో నూతన మందిర నిర్మాణం త్వరగా పూర్తికావాలని ఆకాంక్షించారు. యేసుక్రీస్తు నామమున నూతన మందిర నిర్మాణం త్వరలోనే జరగాలని ప్రత్యేకంగా ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదన్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు బుచ్చిరెడ్డి, రాజు, వెంకట్, సంఘ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అగ్నిప్రమాదంతో దెబ్బతిన్న చర్చి స్థానంలో నూతన మందిర నిర్మాణానికి సహాయహస్తం అందించడం పట్ల గ్రామస్తులు చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ. చంద్రప్రియకు కృతజ్ఞతలు తెలిపారు.

తాండూరులో ఘనంగా శ్రీ ఉడిపి కృష్ణ టిఫిన్స్ ప్రారంభం

ముఖ్య అతిథిగా హాజరైన బీఎస్ఆర్



తాండూరు నవంబర్ 1(జనంసాక్షి) : తాండూరు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఉడిపి కృష్ణ టిఫిన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆర్బీఓఎల్ సీఈఓ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి (బీఎస్ఆర్) ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి టిఫిన్స్ సెంటర్ ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా బీఎస్ఆర్ మాట్లాడుతూ తాండూరు పట్టణంలో ఉడిపి తరహా రుచికరమైన, నాణ్యమైన టిఫిన్స్ అందుబాటులోకి రావడం సంతోషంగా ఉంది. నిర్వాహకులు శుచి, శుభ్రత పాటిస్తూ ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని అన్నారు.ఉడిపి ప్రత్యేక వంటకాల రుచులతో ప్రజల మన్ననలు పొంది, వ్యాపారంలో మంచి అభివృద్ధి సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అంటూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పెద్ద ఉమ్మెంథల్ గ్రామంలో శ్రీ తిరుమలనాథ్ స్వామి వారి బ్రహ్మోత్సవాలలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

పూడూర్ సెప్టెంబర్ 01(జనంసక్షి):
పరిగి డివిజన్ పరిధి లోని పెద్ద ఉమ్మెంతల్ గ్రామంలో శ్రీ తిరుమల నాథ్ స్వామివారిని బ్రహ్మోత్సవాల వేడుకల్లో స్థానిక మండల గ్రామ నాయకులతో కలిసి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి గ్రామ సర్పంచ్ మరియు వార్డు మెంబర్స్ గ్రామ ప్రజలకు పాల్గొని విజయవంతమ్ చేశారు

బంట్వారంలో బస్వాపూర్లో స్వామి వివేకానంద విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

బంట్వారం నవంబర్ 01 జనం సాక్షి :
బంట్వారం వికారాబాద్ జిల్లా బంట్వారం మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో స్వామి వివేకానంద విగ్రహావిష్కరణకు ఆదివారం గ్రామ సర్పంచ్ స్రవంతి శివరాజ్ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ఈ సందర్భంగా స్వామి వివేకానంద జీవిత విశేషాలను పలువురు గుర్తు చేసుకున్నారు. యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం పెంపొందించేందుకు ఆయన చేసిన బోధనలు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. 1893లో చికాగోలో జరిగిన ప్రపంచ మత మహాసభలో భారతదేశ ఆధ్యాత్మిక గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. ఆయన ఆశయాలు, సందేశాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్రవంతి శివరాజ్, ఉప సర్పంచ్ ప్రభాకర్, డీసీసీ ఉపాధ్యక్షులు శాకం రాములు, సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



రిజర్వేషన్లు అనుభవిస్తూ కూడా అంబేద్కర్‌ను విస్మరిస్తున్నారు

బోడుప్పల్-జనంసాక్షి : మల్కాజ్‌గిర మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయసాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 402వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు, బిజెపి నాయకులు బజ్జురి శ్రీనివాస్ గుప్తా, బోడుప్పల్ ఫెడరేషన్ అధ్యక్షుడు అబ్రహం లింకన్ తదితరులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం సాయి బండారి జన్మదినం సందర్భంగా ఆయనను సభ్యులు ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల పుణ్యమా అని ఉన్నత ఉద్యోగాలు, అత్యున్నత పదవులు అనుభవిస్తూ వారంలో కనీసం ఒక్క రోజైనా అంబేద్కర్ ను స్మరించుకునే తీరిక లేదని, పైగా అంబేద్కర్ ఆశయాల కార్యక్రమాలను నిర్వహిస్తున్న వారిపై చులకనగా మాట్లాడడం సిగ్గుచేటని, భవిష్యత్తులో అలాంటి వారికి పుట్టగతులు ఉండవని నత్తి మైసయ్య హెచ్చరించారు. ఉన్నత స్థానాల్లో ఉన్న దళిత, బహుజనులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను నిత్యం స్మరించుకుంటూ ఆయన ఆశయాల కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, గరుగుల యాకయ్య,, బండారి సాయి, రాపోలు వెంకటేష్, రామకృష్ణ, , చిల్ల అంజయ్య, జి శ్రీనివాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వం

-లక్ష్మాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



శామీర్ పేట్, అక్టోబర్ 1(జనం సాక్షి) : మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన వట్టెం ప్రమీలభర్త నర్సయ్యకి ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడంతో గృహప్రవేశ కార్య క్రమాన్ని మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేశం, కౌన్సిలర్లు గోవర్ధన్ రెడ్డి, కటికల శ్రీవాణి వైద్యనాథ్, సరిత శ్రీనివాస్‌తో కలిసి గృహప్రవేశాన్ని ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాల సొంతింటి కల సాకారమవు తోందని, అర్హులైన పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు.తెలంగాణ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి గ్రామంలో ఇల్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు అందులో భాగంగా మేడ్చల్ నియోజక వర్గం లోని ప్రతి నిరుపేద కుటుంబానికి నియోజక వర్గ ఇన్చార్జ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ సహకారంతో ఇల్లు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ సింగం అంజనేయులు, వట్టేశీ భాస్కర్, ఆకుల నాగేష్, కీసర నరసింహులు, తిరిపిగల్ల శ్రీనాథ్, ఆకుల వెంకటేష్, కుటుంబ సభ్యులు మొదలగువారు పాల్గొన్నారు.

తాండూరు నియోజకవర్గంలో విస్తృత పర్యటన

పలు శుభకార్యాల్లో పాల్గొన్న పైలెట్ రోహిత్ రెడ్డి

పలు వివాహ శుభకార్యాలకు హాజరు.. నూతన వధూవరులకు ఆశీస్సులు



తాండూరు, నవంబర్ 1(జనంసాక్షి) : మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఆదివారం తాండూరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు వివాహ శుభకార్యాలు, గృహప్రవేశాలు, పూజా కార్యక్రమాలకు హాజరై కుటుంబ సభ్యులను పలకరించారు. ముందుగా తాండూరు మండలంలోని విరారెడ్డిపల్లెలో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం తాండూరు పట్టణంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్, తులసి గార్డెన్స్, వినాయక కన్వెన్షన్‌లలో జరిగిన పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే పట్టణంలోని 36వ వార్డులో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఇందిరానగర్‌లో జరిగిన గృహప్రవేశ వేడుకకు హాజరై కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. అక్కడి నుంచి యాలాల మండలం అన్నసాగర్‌లోని గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు చేరుకుని నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తాండూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి తో పాటు సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, బిఆర్ఎస్వి నాయకులు, మరియు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ సంఘానికి కొత్త కార్యవర్గం



మల్కాజిగిరి నవంబర్ 1 (జనం సాక్షి) : రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ పుల్లెల గోపీచంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఆనంద్ బాబు పోకూరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి. షాయ్ రెడ్డి, కోశాధికారిగా శ్రీనివాస్ రాజబోయిన ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా టి. రవికుమార్, డి. రఘురామ్, సంయుక్త కార్యదర్శులుగా సి.హెచ్. నీలిమ చౌదరి, కె. జయంత్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎం. ఫణి కిషోర్, కె. దీప్తి రెడ్డి, సిక్కి రెడ్డి, ఆర్.ఎం.వి. గురు సాయిదత్, సాయి ప్రణీత్, ఎం. వేణుగోపాల్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడను మరింత విస్తరించేందుకు సమష్టి కృషి అవసరమని అన్నారు. చిన్న వయసు నుంచే క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ, సరైన మార్గదర్శకత్వం, పోటీల్లో పాల్గొనే అవకాశాలు కల్పించాలని సూచించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం సలహాదారు కె. లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ యు.వి.ఎన్. బాబు, కార్యదర్శి కె. శ్రీనివాసరావు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

వనస్థలిపురంలో మూడు రోజుల ఉచిత ధ్యానోత్సవాలు ప్రారంభం



హయత్‌నగర్, నవంబర్ 1 (జనంసాక్షి) : హార్ట్‌ఫుల్‌నెస్, శ్రీ రామ చంద్ర మిషన్ సంస్థ ఆధ్వర్యంలో వనస్థలిపురం లో మూడు రోజుల ఉచిత ధ్యానోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వనస్థలిపురంలోని సుష్మ సాయి సెంటర్‌లో నిర్వహిస్తున్న ఈ ధ్యాన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. తొలిరోజు కార్యక్రమంలో సుమారు 50 మంది పాల్గొని ధ్యాన సాధన చేశారు. ఈ సందర్భంగా సెంటర్ నిర్వాహకురాలు మాధవి మాట్లాడు తూ, ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని అన్నారు. రోజువారీ ఒత్తిళ్లు, ఆందోళనలు, ఆలోచనల రద్దీ నుంచి ఉపశమనం పొందేందుకు ధ్యానం ఎంతగానో దోహద పడుతుందని వివరించారు. క్రమం తప్పకుండా ధ్యానం చేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉండటంతో పాటు ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచనా విధానం పెంపొందుతాయని తెలిపారు. హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన సాధన ద్వారా అంతర్గత ప్రశాంతతను అనుభవించడంతో పాటు జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను ప్రశాంతంగా ఎదుర్కొనే మనోధైర్యాన్ని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయాన్ని ధ్యానానికి కేటాయించాలని సూచించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ధ్యానోత్సవాల్లో భాగంగా ఆసక్తి ఉన్న వారికి ఉచితంగా ధ్యాన సాధనపై అవగాహన కల్పించనున్నట్లు మాధవి తెలిపారు. ఎలాంటి రుసుము లేకుండా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. తొలిరోజు 50 మంది పాల్గొనడం పట్ల నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు.

కీసర చౌరస్తాలో మళ్లీ వెలుగులు

హైమాస్ట్ లైట్లు, వీధి దీపాలకు మరమ్మతులు..
అధికారులకు తుడుం శ్రీనివాస్ కృతజ్ఞతలు

కీసర, నవంబర్ 01 (జనంసాక్షి) : కీసర ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పనిచేయని హైమాస్ట్ లైట్లు, వీధి దీపాలకు అధికారులు మరమ్మతులు చేయించారు. దీంతో చౌరస్తాలో తిరిగి వెలుగులు నిండటంతో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తొలగాయి. కీసర ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద హైమాస్ట్ లైట్లు, వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్, శీలం మల్లేష్, రాగుల రమేష్ ముదిరాజ్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంఎంసీ కీసర సర్కిల్-1 డిప్యూటీ కమిషనర్ రామలింగం ఆదేశాలతో సంబంధిత అధికారులు ఆదివారం లైట్ల మరమ్మతులు పూర్తి చేయించారు. దీంతో చౌరస్తాలో విద్యుత్ దీపాలు వెలగడంతో రాకపోకలు సాగించే వారికి ఉపశమనం లభించింది. ప్రజా సమస్యను గుర్తించి సత్వరమే పరిష్కరించిన డిప్యూటీ కమిషనర్ రామలింగంతో పాటు సంబంధిత అధికారులకు తుడుం శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యుడు శీలం మల్లేష్, గ్రామ యువ నాయకుడు సుమన్ బన్నీ పాల్గొన్నారు.

ప్రజలలో మార్పు రావాలి

- **బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దారెడ్డి వెంకట్రెడ్డి**
- **మండలంలో జరుగుతున్న నేరాలు, ఘోరాలను ప్రభుత్వం అరికట్టాలి**



మొయినాబాద్ జనం సాక్షి : ప్రజలలో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం ద్వారా అందరం కృషి చేయాలని అందులో భాగంగా పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని మొయినా బాద్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు దారెడ్డి వెంకట్రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ మొయినాబాద్లో ఎన్నో విద్యా సంస్థలు ఉన్నప్పటికి విద్యార్థులకు అవగాహన కల్పించడంలో తమవంతు కృషిగా ప్రభుత్వం ద్వారా అవగాహన కల్పించాల న్నారు. చెడు అలవాట్లే విద్యార్థులకు శాపంగా మారుతున్నాయని పేర్కొన్నారు. నేడు సమాజం లో గంజాయి, డ్రగ్స్ ఎంతో విద్యార్థులకు శాపంగా మారుతుందని వారి బావి జీవితాలకు పులిస్టాప్ గా ఉంటుందని అన్నారు. అలాంటి కార్యక్రమాలలో విద్యార్థులుపాల్గొనకుండా ప్రభుత్వం ద్వారా పోలీసు అధికారులు అవగాహన కల్పించి విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. కేజీరెడ్డి విద్యార్థుల మృతి సంఘటన ఎంతో బాధాకరమన్నారు. విద్యార్థులలో చైతన్యం తేవాల్సిన బాధ్యత విద్యా సంస్థలతో పాటు అధికారులు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు నవంబర్ 2న హైదరాబాద్‌లో మహా పాదయాత్ర



చేవెళ్ల, నవంబర్ 01 (జనంసాక్షి) :ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ బలోపేతం లక్ష్యంగా నవంబర్ 2న సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా పాదయాత్రకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని నిజాం కాలేజ్ నుంచి ప్రారంభమై మొజాంజాహీ మార్కెట్ ఎక్స్ రోడ్డు వరకు ఈ మహా పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ప్రతిష్ఠను కాపాడటం, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం ఈ పాదయాత్ర ప్రధాన ఉద్దేశమని అనంత్ రెడ్డి వివరించారు. ఎన్నికల సంఘం, ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రజలకు వాస్తవాలను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ బలోపేతం కోసం నిర్వహిస్తున్న ఈ మహా పాదయాత్రలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అనంత్ రెడ్డి కోరారు.

గ్రీన్ వాటర్ ట్యాంకర్ సేవలు ప్రారంభం

రాజేంద్రనగర్,నవంబర్1(జనంసాక్షి) : కోకాపేటలోని 15 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ ప్రాంగణంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ ఆధ్వర్యంలో గ్రీన్ వాటర్ ట్యాంకర్ సేవలను సైబరాబాద్ డీఓపీ నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీజీఎం శ్రీనివాస్‌రెడ్డి, జీఎం కృష్ణ నాయక్, వెంకటేశ్వర్లు, భార్గవి, గండిపేట-కోకాపేట మేనేజర్ రామకృష్ణారెడ్డి, మణికొండ-నెక్నాంపూర్ మేనేజర్ మహమ్మద్ మజీద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. శుద్ధి చేసిన మురుగునీటిని గార్డెనింగ్, ఫ్లషింగ్, నిర్మాణ పనులకు వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని అధికారులు తెలిపారు. గ్రీన్ వాటర్‌ను తాగడానికి, వంటకు వినియోగించరాదని స్పష్టం చేశారు.



రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలి

బీఆర్ఎస్ నాయకుడు ఎం. రాఘవేందర్

శంషాబాద్,నవంబర్1(జనంసాక్షి) : శంషాబాద్ మండలంలోనినర్కుడ హనుమాన్ దేవాలయం నుంచి మల్కారం, రామానుజాపూర్ గ్రామాల వరకు ఉన్న రహదారిని వెంటనే వెడల్పు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఎం. రాఘవేందర్ డిమాండ్ చేశారు. మల్కారం వర్ధమాన్ కళాశాల సమీపంలో, అలాగే పరిశ్రమల కార్మికుల రాకపోకలతో ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వారానికి మూడు నాలుగు ప్రమాదాలు చోటుచేసుకుంటూ ప్రాణనష్టం సంభవిస్తోందని ప్లకార్డులు చేత్తో పట్టుకొని రోడ్డుపై ర్యాలీగా తరలి వెళ్లినిరసన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై మల్కారం సర్పంచ్ బిక్షపతి రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్పందించి వెంటనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. అధికారులు, పాలకులు ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

సైబరాబాద్ వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో 205 మందిపై కేసు నమోదు



శేరిలింగంపల్లి, నవంబర్ 01 (జనంసాక్షి) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎన్ని తనిఖీలు జరిగినా... పోలీసులు ఎన్ని కేసులను నమోదుచేసి న్యాయస్థానాలచుట్టూ తిప్పినా... చివరకు జైళ్ల కు తరలించినా వీకెండ్ వచ్చిందంటే చాలు 'ఫుల్లుగా మందు కొట్టు రోడ్డెక్కు' అనే నినాదంతో మందుబాబులు పూటుగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులో అడ్డంగా బుక్కవుతూనే ఉన్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి నుండి ఆదివారం తెల్లవారుజాము వరకు వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ ను సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. నరేందర్ పర్యవేక్షణలో సంబంధిత పోలీస్ అధికారులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మొత్తం 205 మందిపై కేసు నమోదు కావడం జరిగింది. ఈ సందర్భంగా సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం ఏడిసిపి ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడిస్తూ శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విభాగం పోలీసుల వీకెండ్ స్పెషల్ డ్రైవ్ ను విస్తృతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాల నడుపుతున్న వ్యక్తులు మొత్తం 205 మంది వాహనదారులు, వ్యక్తులు మోతాదుకు మించి మద్యాన్ని సేవించి పట్టుబడగా ఇందులో 177 మంది ద్విచక్ర వాహనాల డ్రైవర్లు, 08 మంది ఆటో రిక్షా డ్రైవర్లు, త్రీ వీలర్ వాహనదారులు కాగా 20 కార్లను, ఇతర ఫోర్ వీలర్ లను నడుపుతూ పట్టుబడినట్లు ఏడిసిపి తెలిపారు. ఇందులో 174 మంది బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ తో పట్టుబడడం జరిగిందని, దీనిని కనిష్టంగా 36ఎంజి/100 ఎంఎల్ నుండి 200 ఎంజి/100 ఎమ్మెల్ వరకు, 20 మంది 201 ఎంజి/100 ఎమ్ఎల్ నుండి 300 ఎంజి/100 ఎం ఎల్ మద్యం సేవించడం జరిగిందని, అలాగే 11 మంది 301 ఎంజి/100 ఎమ్మెల్ నుండి 500 ఎంజి/100 ఎమ్మెల్ వరకు మద్యాన్ని సేవించి పట్టు బడడం జరిగిందని ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు వివరించారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరు పరచనున్నట్లు అధికారులు తెలుపగా, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఈ నేరానికి గరిష్ట శిక్ష పది సంవత్సరాల జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరించారు. గత వారం(అక్టోబర్ 26 నుండి అక్టోబర్ 31 వరకు)మొత్తం 289 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కోట్లు పరిష్కరించడం జరిగిందని వీరిలో 26 మందికి జరిమానా, జైలు శిక్ష, ఇద్దరికి జరిమానా, సోషల్ సర్వీస్ 261 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

పుప్పాలగూడ రాణి రుద్రమదేవి పార్కులో బటర్‌ఫ్లై హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహణ

- మహిళల ఆరోగ్య సమస్యలపై వైద్యుల సలహాలు
- పిల్లల ఎదుగుదల, టీకాలపై అవగాహన
- పార్క్ వాకర్స్‌కు ఉచిత ఆరోగ్య పరీక్షలు



గచ్చిబౌలి, హైదరాబాద్ (జనం సాక్షి): మహిళలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా గచ్చిబౌలిలోని బటర్‌ఫ్లై హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పుప్పాలగూడ రాణి రుద్రమదేవి పార్కులో ఉచిత ఆరోగ్య అవగాహన శిబిరం నిర్వహించారు. “ఆరోగ్యవంతమైన మహిళలు, ఆరోగ్యవంత మైన పిల్లలు, సంతోషకరమైన కుటుంబాలు” అనే నినాదంతో ఏర్పాటు చేసిన శిబిరంలో నిపుణులైన వైద్యులు ఉచిత సలహాలు అందించారు.మహిళలు ఎదుర్కొనే ఋతుస్రావ సమస్యలు, పీసీఓడీ, గర్భధారణ సంరక్షణపై సూచనలు ఇచ్చారు. పిల్లల ఎదుగుదల, టీకాలు, సాధారణ ఆరోగ్య తనిఖీలపై అవగాహన కల్పించారు. పార్క్ వాకర్స్‌కు బీపీ, ఎత్తు, బరువు, రక్తంలో చక్కెర, ఆక్సిజన్ స్థాయిలను పరీక్షించారు. మహిళలు, పిల్లలకు పోషకాహారం, పిల్లల పెంపకంపై కూడా సూచనలు అందించారు.ఈ సందర్భంగా బటర్‌ఫ్లై ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వసంత్ కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ రమ్యకృష్ణ, పీడియాట్రిషన్ డాక్టర్ చిత్ర పాల్గొన్నారు. ఆసుపత్రిలో ఈ వారం రోజుల పాటు మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక ఉచిత శిబిరం నిర్వహిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. శిబిరాన్ని నిర్వహించిన వైద్యులు, సాంకేతిక బృందాన్ని పార్క్ నిర్వహణ కమిటీ శాలువాలతో సన్మానించింది.



వేగవంతంగా ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ

అమీర్‌పేట / జూబ్లీహిల్స్(జనం సాక్షి): వెంగల్‌రావు నగర్ మాజీ కార్పొరేటర్ దేదీప్య ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం మధురానగర్‌లో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రమణ, జహంగీర్, లావణ్య, అరుణ్, రాకేష్, బాలు తదితరులు పాల్గొన్నారు. అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా నాయకులు సహకరిస్తున్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో పాదచారులకు ఇబ్బందులు

- **అమీర్‌పేట సత్యం థియేటర్ రోడ్డుపై బోర్డులు, హోర్డింగుల ఏర్పాటు**
- **వ్యాపార ప్రకటనలతో నిండిపోతున్న ఫుట్‌పాత్‌లు**
- **రోడ్డుపై నడుస్తున్న పాదచారులు**
- **పట్టించుకోవడం లేదంటూ జీహెచ్ఎంసీపై స్థానికుల విమర్శలు**

అమీర్‌పేట (జనం సాక్షి): అమీర్‌పేట సత్యం థియేటర్ నుంచి వెళ్లే రహదారిపై ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వ్యాపార సంస్థల ప్రకటన బోర్డులు, బ్యానర్లు, భారీ హోర్డింగులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో ప్రజలు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరోవైపు రహదారి పక్కన చెత్తాచెదారం పేరుకుపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఫుట్‌పాత్‌లపై అనధికారిక ప్రకటన బోర్డులు ఏర్పాటు చేస్తున్నా జీహెచ్ఎంసీ అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అప్పుడప్పుడు కొన్ని బోర్డులను తొలగిస్తున్నప్పటికీ, కొద్ది రోజులకే తిరిగి వెలుస్తున్నాయని పేర్కొంటున్నారు. పాదచారులు రోడ్డుపైకి రావాల్సి వస్తుండటంతో ప్రమాదాల ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై ఉన్న అనధికారిక బోర్డులు, బ్యానర్లు, హోర్డింగులను తొలగించాలని, చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. పాదచారులకు ఇబ్బందులు లేకుండా ఫుట్‌పాత్‌లను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాయల్ కప్ సిల్వర్ విజేతగా కలాష్నికోవ్

బిలీవర్స్ ఎలెవన్‌పై 35 పరుగుల తేడాతో ఘన విజయం



కీసర, నవంబర్ 01 (జనంసాక్షి) : కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని కుందన్‌పల్లిలో నిర్వహించిన రాయల్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో టీమ్ కలాష్నికోవ్ సత్తా చాటింది. కుందన్‌పల్లిలోని ఎంఎస్‌డీ అరేనా మైదానంలో ఆదివారం జరిగిన సిల్వర్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో బిలీవర్స్ ఎలెవన్ జట్టుపై 35 పరుగుల తేడాతో విజయం సాధించి కప్‌ను కైవసం చేసుకుంది. పలు జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో ఫైనల్ పోరు ఉత్కంఠభరితంగా సాగింది. విజేత జట్టుకు నిర్వాహకులు సిల్వర్ కప్‌ను అందజేశారు.కెప్టెన్ మహంత్ రెడ్డి నేతృత్వంలో కలాష్నికోవ్ జట్టు సభ్యులు సమష్టిగా రాణించి విజయాన్ని అందుకున్నారు. ఫైనల్ మ్యాచ్‌లో చందన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. టోర్నమెంట్ బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా పవన్, బెస్ట్ బౌలర్‌గా మహంత్ రెడ్డి, బెస్ట్ ఫీల్డర్‌గా అభినవ్ వ్యక్తిగత పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కెప్టెన్ మహంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ విజయానికి సహకరించిన జట్టు సభ్యులకు, టోర్నమెంట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. విజేత జట్టు సభ్యులు పవన్, వంశీ భార్గవ్, నవీన్, దీపక్, చందన్, ప్రణీత్, అభినవ్, శ్రీను, అశోక్, శ్రీకాంత్, మహేంద్ర, తరుణ్, నరేష్, సమీర్ ఉన్నారు.

ప్రజాస్వామ్య ప్రక్రియలో విద్యావంతులు భాగస్వాములు కావాలి

పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు కావాలి : మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంత్‌రెడ్డి



కీసర, నవంబర్ 01 (జనంసాక్షి) : అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. నాగారం డివిజన్‌లో ఆదివారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌకుట్ల అనంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుల భాగస్వామ్యం కీలకమని అన్నారు. పట్టభద్రుల ఓటు కేవలం ఎన్నికలకే పరిమితం కాదని, విద్యావంతుల ఆలోచనలు, యువత ఆకాంక్షలు, నిరుద్యోగుల సమస్యలు, విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించే ప్రజాస్వామ్య వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మచ్చ శ్రీనివాస్ గౌడ్, గండి అంజయ్య గౌడ్, వరకాల పెంటయ్య గౌడ్, ఎలిజాల నగేష్ గౌడ్, ఏనుగు రామకృష్ణారెడ్డి, ఫిరంగి రాములు, బాలగోని ఐలయ్య, నెల్లుట్ల శ్రీనివాసు, హరికృష్ణ, మీసాల భాస్కర్, బండెల పరమేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో మరిన్ని విజయాలు సాధించాలి

మాజీ కౌన్సిలర్ అనంత్ రెడ్డి నాగేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు



కీసర, నవంబర్ 01 (జనంసాక్షి) : నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, హెమాచంద్ర ట్రేడర్స్ అధినేత శృంగారపు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. స్నేహితులు, శ్రేయోభిలాషుల మధ్య ఆయన పుట్టినరోజు వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంత్‌రెడ్డి హాజరై నాగేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో, మరిన్ని విజయాలు సాధిస్తూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్నేహితులు, ఆత్మీయులు పాల్గొని నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో కౌకుట్ల శ్రీకాంత్ రెడ్డి, పాండవుల ప్రజ్యోత్ కుమార్, కొమ్మూరి హేమేందర్ రెడ్డి, పక్కిర్ గోపాల్ రెడ్డి చెరుకుపల్లి విష్ణు వర్ధన్ రెడ్డి, వీర శేఖర్, గోనె మధు, వూట్ల రాజిరెడ్డి, ఆలేటి సంతోష్ రెడ్డి, బిట్ల రాజశేఖర్ రెడ్డి, మేకల హుస్సేన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాచు పట్టిన నీళ్లతో పశువుల దాహం తీరేదెలా.?

- **నాగసముందర్‌లో అపరిశుభ్రంగా మారిన పశువుల తొట్టి. అధికారుల నిర్లక్ష్యం.?**
- **పశువుల తొట్టిని పట్టించుకునే నాథుడే కరువు.?**
- **మిషన్ భగీరథ ట్యాంకు ద్వారా స్వచ్ఛమైన నీటి సరఫరా చేయాలి.?**
- **అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికుల డిమాండ్.?**



ధారూర్,నవంబర్ 01(జనంసాక్షి) : వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం నాగసముందర్ గ్రామంలో పశువుల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టిలో నాచు పట్టి అపరిశుభ్రంగా మారిన నీటితో పశువులు దాహం తీర్చుకునేది ఎలా.?అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పశువులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై లేదా.? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పశువుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తొట్టిని నిర్వహించాల్సిన వారు పట్టించుకోకపోవడం తో నీరు నాచు పట్టి వినియోగానికి ఇబ్బందికరంగా మారుతోందని చెబుతున్నారు.నెలలు గడుస్తున్నా తొట్టిని శుభ్రం చేయడం,పాత నీటిని తొలగించి కొత్త నీటిని నింపడం వంటి కనీస చర్యలు చేపట్టకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, పశుపోషకులకు పశువులే జీవనాధారం.పాలు, వ్యవసాయ పనులు, పశుసంపదపై ఆధారపడి అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.అలాంటి పశువులకు కనీసం పరిశుభ్రమైన తాగునీరు అందించలేని పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. ఎండలు, నీటి కొరత వంటి పరిస్థితుల్లో పశువులకు తగినంత స్వచ్ఛమైన నీరు అందించడం ఎంతో అవసరం. నాచు పట్టిన, అపరిశుభ్రమైన నీటిని తాగడం వల్ల పశువుల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని పశు పోషకులు ఆందోళన చెందుతున్నారు.మిషన్ భగీరథ ట్యాంకు ద్వారా పశువుల తొట్టిలోకి నీటిని సరఫరా అవుతున్న శుభ్రం చేయడం లేదని సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.తొట్టిలో పేరుకుపోయిన నాచు, మురికిని పూర్తిగా తొలగించి శుభ్రం చేయడంతో పాటు స్వచ్ఛమైన నీరు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.నీటి సరఫరా జరిగినంత మాత్రాన సరిపోదని,తొట్టి నిర్వహణపై కూడా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అంటున్నారు.ప్రజలకు తాగునీరు అందించడమే కాకుండా మూగజీవాల దాహం తీర్చే విషయంలోనూ అధికారులు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువులకు పరిశుభ్రమైన తాగునీరు అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.